Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 108 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 | వెల : 3

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

## మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును

# ఓడించడం దుర్మార్గం




- మహిళలను మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటే!
- మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుపడి జాతికి ద్రోహం చేశారు
- మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి
- నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, నిడదవోలు**

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే - మిగతా3లో



## కేంద్రం ఆదుకుంది.. శనగ రైతులకు

# ప్రయోజనం కలిగింది

- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మాట్లాడిన మంత్రి అచ్చెన్న
- క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు, దిగుబడి పెరిగిందని కేంద్రానికి వివరించిన మంత్రి అచ్చెన్న

## 2శాతం డీఏ పెంపు, గ్రామాలకు రూ.83వేల కోట్లు, కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం



- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు 2%డీఏ పెంపు
- జనవరి 2026 నుంచి అమలు
- గ్రామీణ రహదారులకు రూ.83,977 కోట్లతో పీఎంసీజీఎస్‌పై పొడిగింపు
- ఏపీలో రాజమండ్రి, విశాఖ మధ్య కొత్త రైల్వే లైన్లు



## విపక్షాలు భారీ మూల్యం

# చెల్లించుకుంటాయ్

- జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయ్
- విపక్షాలు జీవితాంతం పశ్చాత్తాపపడతాయని ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మహిళల హక్కులను అడ్డుకున్నారని కిరణ్ రిజిజు ఆరోపణలు
- మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయింది

## దక్షిణాది రాష్ట్రాలను బలహీనపర్చే ప్రయత్నం



- భారత్ అనే భావనను పరిరక్షించడానికే బిల్లును ఓడించాం
- డీలిమిటేషన్‌పై రాహుల్ గాంధీ
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కలిసి బిల్లును అడ్డుకున్నామన్న రాహుల్
- దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల బలం తగ్గించడమే కేంద్ర లక్ష్యమని విమర్శ
- తమిళనాడు సంస్కృతి, భాషపై బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేస్తున్నాయన్న ఆరోపణ

## ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం



- ప్రభుత్వానికి చీకటిరోజు
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రియాంక గాంధీ
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు
- రాజకీయ ప్రయోజనాల కోసమే బిల్లును తీసుకొచ్చినట్లు వ్యాఖ్య
- కేంద్రంపై విమర్శలు

## ఈ నెల 30వ తేదీ వరకు

# స్వీయ జనగణన

- మీ స్మార్ట్ ఫోన్ ద్వారా ఇలా నమోదు చేసుకోండి
- స్మార్ట్ ఫోన్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ
- అధికారిక వెబ్‌సైట్ సాయంతో ప్రజలు స్వయంగా వివరాలన్నీ నమోదు చేసుకునే అవకాశం
- ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

డిజిటల్ విప్లవం కొత్త పుంతలు తొక్కడంతో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాలన, సేవల్లో సైతం వీటి ప్రభావం ఎంతో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ కోవలోనే ప్రభుత్వ గణాంకాల సేకరణ పద్ధతులు కూడా మారుతుండటం ఇప్పుడు గమనించాల్సిన విషయం. గతంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలను సేకరించేవారు. కానీ ఇప్పుడు ఆ శ్రమ లేదు. కేవలం మీ స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా మీరే స్వయంగా మీ మీ వ్యక్తిగత వివరాలన్నింటినీ నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానం ప్రస్తుతం అందుబాటులోనికి వచ్చింది. ఇది ఏ విధంగా పని చేస్తుందో, వాటి వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రభుత్వాలు నిర్వహించేటటువంటి జనాభా - మిగతా3లో

## 2 వేల మంది

# హజ్ యాత్ర



- ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం
- గన్నవరం విమానాశ్రయం నుంచి నేడు, రేపు మక్కాకు వెళ్లనున్న హజ్ యాత్రికులు
- ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2 వేల మంది హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపిన మంత్రి ఫరూక్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గన్నవరం విమానాశ్రయం నుంచి శని, ఆది వారాల్లో రెండు విడతలుగా రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు బయలుదేర నున్నారని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన అవుటపల్లిలోని కన్వెన్షన్‌లో - మిగతా3లో



## హార్ముజ్ వద్ద ఉద్రిక్తత.. రెండు నౌకలపై కాల్పులు

జలసంధి దాటిన భారత నౌకలు

## పార్లమెంటు ఉభయసభల నిరవధిక వాయిదా

- మహిళా రిజర్వేషన్లపై రాజ్యసభలో ప్రైవేటు బిల్లు
- ముగిసిన పార్లమెంటు బడ్జెట్ సెషన్
- 3 రోజుల ప్రత్యేక సెషన్‌లో ఆమోదానికి నోచుకోని బిల్లులు
- స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ప్రధాని, కేంద్ర మంత్రులు, ఎంపీలు



చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## ఘనంగా శ్రీవిఘ్నేష్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ వార్షికోత్సవం



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్18:**
మండలకేంద్రంలోని శ్రీ విఘ్నేష్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ 7వ వార్షికోత్సవం ఆ పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సినీయాక్టర్ దిల్ రమేష్, పెనుమూరు ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్ రమేష్ మాట్లాడుతూ మన పెద్దలు తల్లిదండ్రుల తరువాత ఆ స్థానాన్ని గురువు కి ఇచ్చారని, వైద్యోనారాయణోహరి అని డాక్టర్లను అంటే, గురుదేవోమహేశ్వరహః అని గురువుని దేవునితో పోలుస్తారు అన్నారు. వృత్తులలోకెల్లా ఉత్తమ వృత్తి, కష్టమైన వృత్తి ఉపాధ్యాయవృత్తి అని అన్నారు. అనంతరం ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విలువలతో పెంచాలని, ముఖ్యంగా పిల్లలకు మొబైల్ ఫోన్ ను ఇవ్వకుండా ఉండాలని, వారు చెడు ఆకర్షణకు లోనుకాకుండా వారిని ఒక కంట కనిపెడుతూ ఉండాలని సూచించారు. అలాగే ఈ వేసవిలో పిల్లలకు ఈతను నేర్పించాలని సూచించారు. అలాగే 18 సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్న పిల్లలకు బైకులు ఇవ్వరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగినీ చిరంజీవిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు మునస్వామిశెట్టి, పాఠశాల డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేత

## సేవాభావం చాటిన సీఐ మురళీకృష్ణ





**సూళ్లూరుపేట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్18:**
సూళ్లూరుపేట పట్టణంలోని గణపతి నగర్‌లో నివసిస్తున్న వాయులూరు మునియ అనే వికలాంగుడికి అవసరాన్ని గుర్తించి పోలీసులు ట్రై సైకిల్ అందజేశారు. ఈ సహాయం స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ ఆలోచనతో జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దైనందిన జీవనంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునియకు ఈ ట్రై సైకిల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విధుల్లో కట్టుదిట్టంగా వ్యవహరించడమే కాకుండా సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న సీఐ మురళీకృష్ణ చర్యపై స్థానిక ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతమందికి ఆదర్శంగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు



**దొరవారిసత్రం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
తిరుపతి జిల్లా తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం కేంద్రంలోని తల్లంపాడు పంచాయతీలోని నేతాజీ నగర్ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్షోత్సవాలను అంగన్వాడీ వర్కర్ కండ్రిగ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఐసిడి ఎస్ ప్రాజెక్టు అధికారి వంక జ్యోతి కిరణ్, సూపర్వైజర్ అంకమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భవతులు బాలింతలు జీరో నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వరకు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పోషణ ఆహారాన్ని తీసుకోవ డం వల్ల కలిగే ప్రయోజనాలను గూర్చి తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయామని మేఘలై, ఆశ వాలంటరీ లక్ష్మమ్మ, ఏఎన్ఎం, బాలింతలో, గర్భవ తులు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

### సీనియర్ తెలుగుదేశం కార్యకర్త గుర్రప్ప నాయుడు కన్నుమూత

## నివాళులర్పించిన టిడిపి నాయకులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
వెదురుకుప్పం మండలం యూ.కే. మర్రిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం కార్యకర్త గుర్రప్ప నాయుడు కన్నుమూశారు. ఆయన మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందిస్తూ గ్రామ ప్రజలతో సన్నిహితంగా మెలిగిన నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. గుర్రప్ప నాయుడు మృతదేహానికి నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు గురుసాల కిషన్ చంద్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. వార్డు సభ్యులు, తిప్పినాయుడు పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కుపేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ రెడ్డి, యువ నాయకులు భాష్యం సతీష్ నాయుడు, రెడ్డి కుమార్ యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుర్రప్ప నాయుడు పార్టీ అభివృద్ధికి కృషి చేసిన విధానం ఆదర్శప్రాయమని తెలిపారు. గ్రామంలో సామాజిక కార్యక్రమాలలో కూడా ఆయన చురుకుగా పాల్గొని ప్రజల ఆదరణ పొందినట్లు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. గ్రామ ప్రజలు పాల్గొని చివరి వీడ్కోలు పలికారు.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక

## ద్రావిడ విశ్వవిద్యాలయం 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ





**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
కుప్పంనియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో 29వ వార్షికోత్సవం శనివారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఎం.ఎస్.సుబ్బులక్ష్మి సభా భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఎల్‌సి మల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవం విద్యార్థులకు అంకితమైన ప్రత్యేకమైన రోజు అని పేర్కొన్నారు. విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే మంచి జ్ఞానం సంపాదించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు అధ్యాపకులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక సమరసత వేదిక సమన్వయకర్త కాసిబొట్ల శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యా ర్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జీవితంలో కష్టపడి సాధించిన విజయాలే నిలకడగా ఉంటాయని, ప్రయత్నం చేస్తే అసాధ్యమేమీ లేదని సూచించారు. ప్రముఖుల జీవితాలను ఉదాహరణగా తీసుకుని విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. రిజిస్ట్రార్ బాధ్యతలు నిర్వహిస్తున్న వి కిరణ్ కుమార్ గౌరవ అతిథిగా పాల్గొని డిగ్రీ, పీజీ పూర్తి చేస్తున్న విద్యార్థులను అభినందించారు. విశ్వవిద్యాలయంలో పరిపాలనా విధానాలు ఆధునిక పద్ధతుల్లో అమలవుతున్నాయని తెలిపారు. అకాడమిక్ వ్యవహారాల అధికారి కె శ్యామల వార్షిక నివేదికను సమర్పిస్తూ విశ్వవిద్యాలయం నుండి మొత్తం రెండు వందల తొంభై ఎనిమిది పుస్తకాలు వెలువడినట్లు తెలిపారు. ఇవి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం తదితర భాషల్లో ప్రచురించబడినట్లు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా పలు నిర్మాణాలు పూర్తి కాగా, పరిశోధనలు, విద్యార్థుల చేరికలు పెరిగినట్లు వివరించారు. ఉపకేంద్ర ప్రధానాచార్యురాలు ఎస్ విజయవర్ధిని మాట్లాడుతూ డిగ్రీ కోర్సులు సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. శారీరక విద్య విభాగాధిపతి వి మెర్సీ జ్యోతి మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బడి పిలుస్తోంది కార్యక్రమం





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 18:**
శ్రీకాళహస్తి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ బడి పిలుస్తోంది కార్యక్రమా న్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తిలోని ఎస్.ఎస్. బి మునిసిపల్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలు బృందాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బృందాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు లంతా తమ పరిధిలో బడి ఈడు కలిగిన పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించామని తెలియజేశారు. ఇందుకు సంబంధించి విద్యా శాఖ వారం రోజుల ప్రణాళికను రూపొందించిందని. ప్రధానంగా ఒకటో తరగతిలో ప్రవేశాల పై దృష్టిసారించాలని సూచించిందని, అలాగే ప్రభుత్వ పాఠశా లలో ఐదోతరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఆరో తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రుల ను అవగాహన ర్యాలీ కల్పించాలి అని అన్నారు. పిల్లలుండే ఇళ్లకువెళ్లి తల్లిదండ్రులను నచ్చజెప్పి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీ వరకు పాఠశాలల పరిధిలో ఇళ్లకు వెళ్లడం, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడం వంటి చేపడతామన్నారు. పిల్లల చేరికలను ఖరారు చేసి అదేరోజు అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తామన్నా. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడి ఉన్నాయని, విశాలమైన తరగతులు, క్రీడామైదానాలు, లైబ్రరీలతో ప్రభుత్వ పాఠశాలలో నేడు నూతన హంగులతో అత్యంత అద్భుతంగా ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి వారి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలలు బలోపితం అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు, పిల్లలకు విలువతో కూడిన విద్యతోపాటు ప్రశాంతపు వాతావరణం విద్యలో అవలంబించేలా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని కాబట్టి చిన్నారుల తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేపించవలసిందిగా సందర్భంగా ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## అక్రమ క్వారీ పై పోలీసుల దాడి

### యంత్రాలు స్వాధీనం.. కేసు నమోదు





**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఏప్రిల్ 18:**
కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం సోలిశెట్టిపల్లి గ్రామ పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న గనిపై పోలీసులు దాడి చేసి యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. డి.ఎస్.పి స్థాయికి అందిన సమాచారం మేరకు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్,రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి శనివారం ఈ దాడి నిర్వహించారు. దాడిలో అక్రమంగా నిర్వహిస్తున్న గనిని గుర్తించి తక్షణమే నిలిపివేసి సంబంధిత శాఖ అధికారులకు అప్పగించారు. ఈ అక్రమ క్వారీ కుప్పం ప్రాంతానికి చెందిన నాగేంద్ర బాబు నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. సంఘటన స్థలంలో ఒక తవ్వే యంత్రం, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా, క్వారీ నిర్వహించడం, ఖనిజాలను రవాణా చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమ గనుల తవ్వకం లేదా రవాణా జరుగుతున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## అభివృద్ధి పనుల్లో ఆలస్యం సహించం

### అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18**
పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరుగుతున్న తీరుపై స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తీవ్ర అసహనంవ్యక్తం చేశారు. నిధులు మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధికారులు సమన్వయంతో సక్రమంగా పని చేయగలరా చేయలేరా అంటూ ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో పురో గతి కనిపించడం లేదని, మాటలతో కాలాన్ని వృథా చేయడం తగదని హెచ్చరించారు. నెల రోజుల్లోపు అన్ని అభివృద్ధి పనులు ప్రారంభం కావాలని, లేకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పట్టణంలో మురుగునీరు శుద్ధి చేసే కేంద్రం అంశం రోజులు గడుస్తున్నా పరిష్కారం దిశగా ముందుకు సాగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు చొరవ చూపడం లేదని, కాలయాపన చేయడం తప్ప ప్రగతి లేదని పేర్కొన్నారు. అలాగే సుమారు మూడు కోట్ల రూపాయల నిధులు ఉన్నప్పటికీ రోడ్లు,డ్రైన్లనిర్మాణంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని నిలదీశారు. క్షేత్రస్థాయి లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కార మార్గాలు కనుగొని పనులు వేగవంతం చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పోలీసుల సహకారం తీసుకుని అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో భవాని, తహసీల్దార్ ఇన్బనాథన్, డీఎస్పీ దేగల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణారెడ్డి, టి పి ఎస్ ఇందిరా, మున్సిపల్ డిఈ, ఏఈలు పాల్గొన్నారు.

## మహిళల భద్రత, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై

### అవగాహన కార్యక్రమం డి.ఎస్.పి పార్థసారథి



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
సురక్షిత చిత్తూరు కార్యక్రమంలో భాగంగా శనివారం శాంతిపురం మండల కేంద్రంలో మహిళల భద్రత, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా మరియు సామాజికంగా కలిగే నష్టాలపై విస్తృతంగా వివరించారు. కార్యక్రమంలో కుప్పం డి.ఎస్.పి పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, శాంతిపురం తహశీల్దార్ సురేష్ బాబు, రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్, శాంతిపురం శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి కల్పన పాల్గొని ప్రసంగించారు. మహిళల భద్రత కోసం ప్రభు త్వం తీసుకుంటున్న చర్యలు, పోలీసుల సేవలను ప్రజలు వినియోగించు కోవాల్సిన అవసరాన్ని వివరించారు. సుమారు 200 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని గ్రామస్థులకు అవగాహన కల్పించడంలో తమ వంతు పాత్ర పోషించారు. సమాజంలో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రతి ఒక్కరూ మహిళల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరిగిందని, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

### పదో తరగతి ఫలితాల్లో

## హాకింగ్స్ విద్యార్థుల శతశాతం విజయం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
కేంద్ర మాధ్యమిక విద్యా మండలి పదోతరగతి పరీక్షా ఫలితాల్లో హాకింగ్స్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి విజయభేరి మోగించారు. విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించగా, అందులో ప్రతి ఒక్కరు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మొత్తం విద్యార్థుల్లో సగం మంది ప్రతిభా శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. పాఠశాల అధ్యక్షుడు హఫీజ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం 100% ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు గౌరవ సూచకమని, ఇది గర్వకారణమని ఆనందం వ్యక్తంచేశారు. మంచి బోధనతో పాటు సహ పాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఈ విజయాని కి కారణమని తెలిపారు.తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తరగతులకు ఓపికతో విద్యార్థులను పంపిస్తూ వారి భవిష్యత్తుపై బాధ్యతగా వ్యవహరించడం అభినందనీయమని కొనియాడారు. విధి పట్ల నిబద్ధతతో, అంకిత భావంతో విద్యాబోధన చేసి విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. కష్టపడిన వారికి ఫలితం తప్పకుండా దక్కుతుందని పేర్కొంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.పాఠశాల నిర్వహణాధికారి షబ్బీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని నిర్వహించిన పరీక్షలను సమర్థంగా రాయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమ య్యాయని అన్నారు. శ్రమించిన వారికి ఫలితం తప్పకుండా దక్కుతుందనే నమ్మకంతో విద్యార్థులు ముందుకు సాగా లని సూచించారు. పాఠశాల ప్రధానాచార్యుడు మిల్లర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఫలితాలు ఆనందదాయకమని,తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషివల్లే ఈ స్థాయి విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణాధికారులు షబ్బీర్, రఫిక్, ప్రధానాచార్యుడు మిల్లర్, ఉప ప్రధానాచార్యులు అరుణాసింగ్ చౌహాన్,గౌతమన్,బాలవిభాగ సమన్వ యకర్త నదియ, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# 2 వేల మంది హజ్ యాత్ర

-మొదటిపేజీ తరువాయి

హజ్ క్యాంపు కార్యాలయం వద్ద యాత్రికుల బస్సును మంత్రి కొల్లు రవీంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి నేడు, రేపు (ఏప్రిల్? 18, 19 తేదీల్లో) రెండు విడతలుగా రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు మక్కా యాత్రకు బయలుదేరనున్నట్లు తెలిపారు. మొదటి విడత హజ్? యాత్రికులు ప్రయాణం ప్రారంభమయ్యింది. మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2 వేల మంది హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపారు. వీరిలో గన్నవరం విమానాశ్రయం నుంచి ఈ నెల 18న 156 మంది, 19న 177 మంది హజ్? వెళ్లనున్నారు. గన్నవరం నుంచి బయల్దేరే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటించిందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ పాల్గొన్నారు. ప్రత్యేక వసతులతో శిబిరాలు: హజ్ యాత్రికులకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు 6 కోట్ల 40 లక్షల రూపాయల విడుదలకు ప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు. విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాల నుంచి హజ్ యాత్రకు వెళ్లే రాష్ట్రానికి చెందిన వారికి ప్రత్యేక వసతులతో శిబిరాలు నిర్వహించేందుకు ఈ నిధులు వినియోగించనున్నట్లు చెప్పారు.

'హజ్ యాత్ర కోసం మొదటి సారిగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్? ఏర్పాటు చేశారు. ప్రభుత్వం



ఏర్పాట్లు చాలా బాగా చేశారు. అన్ని సదుపాయాలు బాగున్నాయి. మేము ఊహించిన దాని కంటే హజ్? కమిటీ అద్భుతమైన సేవలందించింది. అల్లా దగ్గరకు వెళ్లే మా ప్రయాణం కూటమి ప్రభుత్వ కల్పించిన సౌకర్యాలతో ఎంతో సాఫీగా ఆనందంగా ప్రారంభమయ్యింది.' హజ్? యాత్రికులకు కూటమి సాయం: విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న యాత్రికుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని జమ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా గతంలోనే తెలిపారు. విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారు ఎక్కువమంది లేకపోవడంతో 2025లో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్రం రద్దు చేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని కేంద్రానికి లేఖ రాయడంతో దానిని పునరుద్ధరించిన సంగతి తెలిసిందే.

# నత్తనడకన దిండి- చించినాడ పనులు

**రాజమండ్రి :** ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ దిండి–చించినాడ గ్రామాల వద్ద వశిష్ట నదీపాయపై నిర్మించిన వంతెన మరమ్మత్తుల పేరుతో భారీవాహనాలను నిషేదించి ఇప్పటికి 8నెలలు పూర్తి కావస్తుంది.. అయినప్పటికీ మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండడం ప్రజలకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. అటు పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం జిల్లాలు ఇటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలకు అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రతీరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మరమ్మత్తులతో అటుగా విద్యార్థులు నడిచి వచ్చి వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఇదే తరహాలో ఉద్యోగులు కూడా అనేక సమస్యలు లేవనెత్తుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు అయితే వర్ణణాతీతం అంటున్నారు.. బస్సు ఎక్కి దిండి వద్ద దిగాల్సి వస్తుందని, మళ్లీ వంతెన పొడవునా నడిచి చించినాడ వెళ్లి అక్కడ బస్సు ఎక్కి వెళ్లాల్సి వస్తోందని, అదేవిధంగా సాయంత్రం తిరిగి ఇళ్లకు వస్తున్నప్పుడు చించినాడ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి వంతెన పక్క నుంచి నడిచి మళ్లీ దిండి వద్ద బస్సు ఎక్కాల్సి వస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.. ఇదే తరహాలో కళాశాల బస్సులు వంతెనకు ఇరువైపులా ఉంచి విద్యార్థులను తరలిస్తున్నాయి. ఈమధ్యలో వంతెన పొడవునా నడుచుకుంటూ వెళ్లడం వల్ల రెండు గంటల సమయం వృథా అవుతుందంటున్నారు విద్యార్థులు.. దీని వల్ల అలసిపోవడం, కాలేజీలకు లేట్ అవ్వడం జరుగుతుందని వివరిస్తున్నారు. ఈప్రభావం చదువుపై పడుతుందంటున్నారు...దిండి – చించినాడ వద్ద 216 జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న ఈ వంతెన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. కేవలం పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలే కాదు విశాఖపట్నం నుంచి వచ్చిన వారు నర్సాపురం, మచిలీపట్నం, విజయవాడ వెళ్లేవారు ఎక్కువగా ఈ రహదారి ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు.. ట్రక్కులు, గూడ్స్ వెహికల్స్ కూడా ఈ రోడ్డు ద్వారా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి.. ఈ వంతెన మమ్మత్తులతో భారీ వాహనాలకు బ్రేక్ వేశామని చెబుతున్నా రాత్రి వేళల్లో అయితే లైట్ మోటారు వెహికల్స్‌కు కూడా అనుమతులు నిలిపివేయడం ప్రజల ఆగ్రహానికి కారణం



అవుతుంది..2025 ఆగస్టు 25 నుంచి మరమ్మత్తుల నిమిత్తం ఈ వంతెనపై నిషేధం విధించారు. అప్పటి నుంచి బస్సులు, లారీలు, ఐషర్ వేన్‌లు ఇలా కొంచెం పెద్ద వాహనాలు ఏవీ రాకుండా నిషేదించారు. కార్లు, ఆటోలు, బైక్‌లకు మాత్రమే వెళ్లేందుకు అవకాశం కల్పించడగా వాటికి కూడా రాత్రివేళల్లో నిలిపివేయడంతో ఈ వంతెనపై ఏ సమయంలో ఎటువంటి ఆటంకం కలుగుతుందో తెలియని ప్రజలు ఈ మార్గంలో ప్రయాణాలు విరమించుకుంటున్నారు.. ఇప్పటివరకు వంతెన బేరింగ్ పనులు చేస్తోన్న సదరు కాంట్రాక్ట్ సంస్థ ఈ పనులను కూడా నత్తనడకన చేస్తుందని విమర్శిస్తున్నారు. మరో నెల రోజులు పైబడి వంతెన మరమ్మత్తులు జరుగుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ మరో మూడు నెలల వరకు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారువంతెన బేరింగ్ మరమ్మత్తు పనులు నిర్వహించే క్రమంలో వంతెన పిల్లర్ల వద్ద ఉన్న జాయింట్‌పై ఒత్తిడి పడకుండా పైన ఒక తాత్కాలిక ఇనుప వంతెన అమర్చుతున్నారు. ఇది ర్యాంప్ లు కలిగి ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయంటున్నారు. తాత్కాలిక వంతెన ర్యాంపు ఎక్కించే క్రమంలో కార్లు వేగాన్ని పెంచి వెళ్లడం వల్ల పలు ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. 2025 ఆగస్టు 25 నుంచి ప్రారంభమైన ఈ మరమ్మత్తు పనులు పొడిగిస్తూ వస్తున్నారు.. ఇప్పటికే మూడు సార్ల వంతెనపై నిషేదాజ్ఞలు పొడిగిస్తూ వచ్చిన సదరు కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన గడువు పూర్తి అయినా ఇప్పటికీ మరమ్మత్తులు పూర్తి చేయలేని దుస్థితి కనిపిస్తోంది. కొన్ని రోజుల్లోనే పూర్తి స్థాయిలో వంతెన మరమ్మత్తులు పూర్తిచేస్తామని చెప్పుకొస్తున్నా అక్కడ పరిస్థితులను బట్టి మరో మూడు నెలలు పాటు కాలయాపన చేసేలా ఉన్నారని ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# కిలారు రాజేష్‌కు ఎందుకంత ప్రాధాన్యం

**విజయవాడ :** రాజకీయాలలో అవసరాలు మాత్రమే ఉంటాయి. ఎప్పటికీ అయ్యేది ప్రస్తుతమో అనే సామెత తీరుగానే అవి సాగిపోతుంటాయి. కానీ కొంతమంది వీటికి విరుద్ధంగా ఉంటారు. అవసరాలు కాకుండా ఆత్మీయత అనే ధోరణిలో పని చేస్తుంటారు. నాది అని కాకుండా.. మనది అనే కోణంలో అడుగులు వేస్తుంటారు. స్నేహం కోసం చివరికి తమను తాము కూడా లెక్క చేయరు. అటువంటివారు ఎటువంటి గుర్తింపును కోరుకోరు. ఎక్కడో మూలన ఉండిపోతారు. కానీ వెలుగులోకి వస్తే మాత్రం ఉదయించే సూర్యుడు కంటే ఎక్కువగా ప్రజ్వలిస్తుంటారు. ఈ ఉపమానం ఈ నాయకుడికి నూటికి నూరు శాతం సరిపోతుంది. ఆయన ఎవరు.. ఎందుకింత చర్చ జరుగుతోంది.. అనే ప్రశ్నలకు సమాధానం ఈ కథనం.ఆయన పేరు కిలారు రాజేష్. తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రెటరీగా నియమితుల య్యారు. సాధారణంగా ఈ స్థాయికి రావాలంటే తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడాలి. చిన్న వయసులోనే ఆయనకు ఈ పదవి రావడం ఒకరకంగా వరమైతే.. ఆయన పడిన కష్టానికి లభించిన గౌరవం. నారా లోకేష్, కిలారు రాజేష్ మధ్య బలమైన స్నేహం ఉంది. వీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకు న్నారు. అలా ఏర్పడిన స్నేహం చివరికి రాజకీయాలకు దారితీసింది. రాజకీయాలలో కూడా నాలా లోకేష్ కు నమ్మిన బంటుగా కిలారు రాజేష్ ను ఆవిర్భవించేలా చేసింది. 2012లో తెలుగుదేశం పార్టీలో చేరారు రాజేష్. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ అధికారం లో లేదు. తెలంగాణ



ఉద్యమం వల్ల ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇలాంటి స్థితిలో పార్టీలో ప్రవేశించిన రాజేష్.. నారా లోకేష్ కు నమ్మిన బంటుగా మారిపోయారు. 2014లో ఏపీలో తెలుగుదేశం అధికారంలోకి రావడంలో రాజేష్ కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా యువతను పార్టీకి దగ్గరగా చేశారు. నారా లోకేష్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కిలారు రాజేష్ కీలకంగా వ్యవహరించారు. 2019లో పార్టీ ఓడిపోయిన తర్వాత రాజేష్ మరింత పట్టుదలతో పనిచేయడం మొదలు పెట్టారు. చంద్రబాబు జైలుకు వెళ్లడం తో లోకేష్ మీద ఒత్తిడి పెరిగిపోయింది.. ఈ నేపథ్యంలో నారా లోకేష్ కు అండగా నిలబడ్డారు రాజేష్. పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ కు వివరించారు. వైసిపి చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టారు. తెర ముందుకు రాకపోయినప్పటికీ.. తెర వెనుక ఎంత చేయాలో అంతచేశారు రాజేష్. నారా లోకేష్ యువ గళం పేరుతో చేసిన పాదయాత్రకు కర్త కర్మ క్రియ రాజేష్ అంటే అతడి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 3000 కిలోమీటర్ల పాటు లోకేష్ పాదయాత్ర జరిగితే.. ప్రారంభం నుంచి చివరి వరకు రాజేష్ ఆయన వెంట ఉన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడంలో.. ప్రజలకు నారా లోకేష్ ను మరింత చేరువ చేయడంలో రాజేష్ కీలక పాత్ర పోషించారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రాజేష్ ఎటువంటి పదవిని కోరుకోలేదు. అధికారంలో లేనప్పుడు ఎలా అయితే ఉన్నారో.. ఇప్పుడు కూడా అలానే ఉన్నారు.అతడి నిరాడంబరతను గుర్తించిన పార్టీ సుప్రీమ్ చంద్రబాబు నాయుడు.. జనరల్ సెక్రెటరీ పదవితో అతడి సేవలను గుర్తించారు.. దీంతో రాజేష్ సేవలను మరింత ఉపయోగించుకోవాలని చంద్రబాబు భావించి ఈ పదవి కట్టబెట్టారు. జనరల్ సెక్రెటరీ పదవి వచ్చినప్పటికీ రాజేష్ డౌన్ టు ఎర్త్ లాగానే ఉన్నారు. నారా లోకేష్ కు నమ్మిన బంటు లాగానే సాగుతున్నారు..విలువలు పాటించే వారికి పదవి అవసరం లేదు. పార్టీ మాత్రమే ముఖ్యం అనుకునే వారికి ఎటువంటి హోదా అవసరం లేదు. కొంతమంది ముందు గౌరవం కూడా తగ్గిపోతుంది. పదవి కూడా తన స్థాయి తగ్గించుకుంటుంది. ఎందుకంటే మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు మిగతావన్నీ చిన్న ఇసుక రేణువుల మాదిరి లాంటివే కదా.. ఈ ఉపమానం నూటికి నూరు శాతం కాదు కోటి శాతం కిలారు రాజేష్ కు వర్తిస్తుంది.

## మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఓడించడం దుర్మార్గం

-మొదటిపేజీ తరువాయి

రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ..‘ భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కల సాకారం అవుతుందని భావించాం. పార్లమెంటు, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నాం. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతి లో భాగం. నిన్న పార్లమెంటులో దీనికి భిన్నంగా జరిగింది. విపక్షాల వైఖరికి నిడదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం.మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నాను. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి. ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయి. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం.దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా.?‘ అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## కేంద్రం ఆదుకుంది.. శనగ రైతులకు ప్రయోజనం కలిగింది

**అమరావతి** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దఢసంకల్పంతో పనిచేస్తోందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయబోమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దష్టిలో ఉంచుకుని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో శనివారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శనగలు, మొక్కజొన్న పంటల పరిస్థితిని సమగ్రంగా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్రంలో శనగల సాగు గణనీయంగా పెరిగి, మొత్తం సుమారు 7,13,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తయిందని, మిగిలిన పంటను రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. అదనంగా 1,78,250 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15,000 మెట్రిక్ టన్నుల శనగలు తక్షణమే కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 68,750 మెట్రిక్ టన్నుల శనగలను కూడా త్వరలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## ఈ నెల 30వ తేదీ వరకు స్వీయ జనగణన

-మొదటిపేజీ తరువాయి

గణన లేదా ఇతర రకాలైన సర్వేల్లో, ప్రజలు ఎన్యుమరేట్?ల సాయం లేకుండా అధికారిక పోర్టల్ ద్వారానే తమ కుటుంబ వివరాలను నమోదు చేయడాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ అంటారు. ఇది గోప్యతను కాపాడటమే కాకుండా, సమయాన్ని సైతం ఆదా చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

నమోదు ప్రక్రియ: ముందుగా https://se.cen-sus.gov.in అని అధికారిక వెబ్‌సైట్‌ని ఓపెన్ చేసి సందర్శించాలి. ఇక్కడ ఉన్న లాగిన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రం, క్యాప్చాను నమోదు చేసి వెరిఫై చేయాలి. ఆ తర్వాత యజమాని పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ నమోదు చేస్తే ఫోన్‌కు ఆరు అంకెల సందేశం వస్తుంది. వీటిని నమోదు చేసిన అనంతరం ప్రక్రియ అనేది ప్రారంభమవుతుంది. శాటిలైట్ మ్యాప్ కనిపిస్తూనే మీ చిరునామా, పిన్‌కోడ్ నమోదు చేయమని అడుగుతుంది. మీరిచ్చే సమాచారం ఆధారంగా అక్షాంశాలు, రేఖాంశాల వివరాలను తీసుకుని ఆపై మీ ఇంటిని మ్యాపులో నమోదు చేస్తుంది. అనంతరం ప్రశ్నావళి అనేది మొదలవుతుంది.

మీ ఇల్లు మట్టితో నిర్మించారా లేక సిమెంటుతో నిర్మితమైనదా? వీటి గోడల పరిస్థితి ఏ విధంగా ఉంది? అదే విధంగా ప్రస్తుతం మీ ఇల్లు ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది. ఇలా దాదాపు 30 ప్రశ్నల వరకు సమాధానాలను ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా కుటుంబ సభ్యుల పేర్లు, వయసు, వారి వారి విద్యార్హతలు అలా అన్నీ నమోదు చేసుకుని సేవ్ చేసుకుంటూ వెళ్లినట్లయితే చివరకు ప్రివ్యూ చూసుకుని సబ్మిట్ చేయమని అడుగుతుంది. ఆపై సబ్మిట్ చేయగానే ఓ రెఫరెన్స్ నంబర్ వస్తుంది.

దానిని ఆ తర్వాత క్రమంలో ఎన్యుమరేటర్ మన ఇంటికి వచ్చినప్పుడు ఆ నెంబర్? ఇస్తే సరిపోతుంది. మళ్లీ మన వివరాలను వారికి చెప్పాల్సిన అవసరం ఏ మాత్రం ఉండదు. ఈ నెల ఏప్రిల్ 16 నుంచి 30 వరకు స్వీయ లెక్కింపునకు అవకాశం కల్పించినట్లు అధికారులు వెల్లడించగా, పోర్టల్‌లో తెలుగు సహా అన్ని ప్రాంతీయ భాషల్లో వివరాలను నింపేటటువంటి సౌకర్యాలను కల్పించడం విశేషం. ఈ పోర్టల్ ద్వారా ప్రజలు స్వయంగా వివరాలన్నీ నమోదు చేసుకునే అవకాశం ఉండటం గమనార్హం.

**ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం**

ఏపీలో స్వీయ జన గణనకు ఏప్రిల్ 16వ తేదీ గురువారం నుంచి మొదలై ఈ నెల 30వ తేదీ వరకు ఉండనుందని అధికారులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇందులో భాగంగా మొదటిసారి డిజిటల్ సాధనాల ద్వారా వివరాలను సేకరించనున్నారు. అందుకే కాబోలు ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కల్పించేందుకు విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. అదే విధంగా స్వీయ గణన చేసుకునేందుకు ఓ క్యూఆర్ కోడ్‌ను సైతం అందుబాటులో ఉంచారు. ఈ కోడ్‌ను స్కాన్ చేసి లేదా అందుకు కేటాయించిన ప్రత్యేక వెబ్ పోర్టల్‌లోకి వెళ్లి వివరాలను నమోదు చేసుకోవచ్చు. అనంతరం 11 అంకెల విశిష్ట సంఖ్య (ఎస్ఈ ఐడీ) వస్తుంది. మే 1వ తేదీ నుంచి జన గణన సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు వారికి ఐడీని చూపించినట్లయితే వారే నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు.

## యువనాయకత్వం...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇటీవల వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ తన వ్యూహాలను క్రమబద్ధంగా అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న పార్టీ జాతీయ ,రాష్ట్ర కమిటీలను తాజాగా ప్రకటించడం ద్వారా కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఈ ప్రక్రియలో నారా లోకేష్ కి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఇవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే గత మహానాడు సమయంలో లోకేష్‌కు ఈ బాధ్యతలు ఇవ్వవచ్చని చర్చలు జరిగినా, ఈసారి మహానాడు ముందుగానే అధికారికంగా ప్రకటించడం గమనార్హం. దీంతో పార్టీ వ్యవహారాలపై లోకేష్‌కు మరింత పట్టు వచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈసారి మహానాడు సమావేశంలో ఆయన కొత్త హోదాలో పాల్గొనడం ద్వారా పార్టీపై తన ప్రభావాన్ని మరింత పెంచుకునే అవకాశముంది.ఇక జూన్ నెలలో టీడీపీ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనుండటం కూడా కీలక అంశంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ పై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. సరైన సమయం చూసుకుని ఈ మార్పులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కమిటీలలో చేసిన మార్పుల మాదిరిగానే, ప్రభుత్వం లో కూడా కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కూటమి మంత్రివర్గంలో ఇప్పటికే కొత్తవారికి కొంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, రాబోయే మార్పుల్లో మరింత చురుకుగా పనిచేసే నాయకులను తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాలను బలంగా ప్రచారం చేయగలిగే నాయకులను ఎంపిక చేయడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పనితీరు ఆధారంగా కొంతమంది సీనియర్ మంత్రులకు మార్పులు జరిగే అవకాశమూ ఉన్నట్లు సమాచారం.

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు

# సన్మానం చేసిన ఐటీడీపీ సభ్యులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రామామూర్తి, ప్రధాన కార్యదర్శి శివతో పాటు వివిధ మండలాల ఐటీడీపీ అధ్యక్షులు భాస్కర్, మంజునాథ్, రాజేంద్ర, సతీష్ పాల్గొన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శులు పవనకుమార్, గిరిబాబు, అశోక్, గణేష్ తదితరులు హాజరై కంచర్ల శ్రీకాంత్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు స్వీకరించడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తానని పేర్కొన్నారు.

## మే 01 నుండి ఉచిత వేసవిబడిని

# సద్వినియోగం చేసుకోండి.



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
హిందూపురం పట్టణం త్యాగరాజ నగర్ లోగల మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల ఆవరణంలో రాజ్యలక్ష్మి డెకరేషన్ నాగరత్న మోహన్ కుమార్ దంపతుల సౌజన్యంతో మే నెల 1 నుంచి జూన్ నెల 1వ తేదీ వరకు ఉచిత వేసవిబడిని నిర్వహిస్తున్నట్లు నిర్వాహ కులు కె.సాయికళ-కె.మాళప్ప దంపతులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వస్తు రూపేణా దాతలు అందించు సాయంతో 28 సం.రాల నుండి ఉచిత వేసవిబడులు నిర్వహిస్తున్నామన్నారు. నిరక్షరాస్యత తగ్గించి బాల కార్మికవ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా 1999 యేడాది నుండి విద్యాభివద్ధికి కృషి చేస్తున్నట్లు వారన్నారు. కరాటే, కంప్యూటర్, యోగ, క్రీడలు, సంగీతం, నృత్యాలు, చిత్ర లేఖనం, చక్కని దస్తూరి తదితర విద్యలలో విలువలతో కూడిన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 6-14 సం.రాల చిన్నారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం పరచుకోవాలని మరిన్ని వివరములకు సెల్ నంబర్ 9441144630 , 9381824304 సంప్రదించాలని కె.సాయికళ-కె.మాళప్ప దంపతులు కోరారు.

## స్కౌట్స్ మాస్టర్లకు అడ్వాన్స్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రదానం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
శ్రీకాళహస్తి ఫిబ్రవరి 2 నుంచి 8వ తేదీ వరకు స్థానిక ఆర్పీబీఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కౌట్స్ మాస్టర్ల అడ్వాన్స్ కోర్స్ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి కార్యదర్శి జి. విజయకుమార్‌తో పాటు స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి. రమేష్ బాబు మాట్లాడుతూ, స్కౌట్ యూనిట్ ఉన్న ప్రతి పాఠశాలలో విద్యార్థులతో స్కౌట్ కార్యకలాపాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవాభావం పెంపొందేలా స్కౌట్స్ మాస్టర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పాఠ్యపుస్తకాలు వితరణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
శ్రీకాళహస్తి గ్రంథాలయానికి ఎస్ఎస్ఆర్ అకాడమీకి చెందిన జి.మంజునాథ్,కృష్ణ సాయి, ఎంట్రన్స్ పరీక్షలకు ఉపయోగపడే పాఠ్యపుస్తకాలను ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంథాలయ చైర్మన్, రెడ్డివారి గురువారెడ్డి చేతుల మీదుగా శ్రీకాళహస్తి గ్రంథాలయ అధికారిని లావణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షలకు ఉపయోగపడే పాఠ్య పుస్తకాలను శ్రీకాళహస్తి గ్రంథాలయానికి విరాళంగా అందజేసిన ఎస్ ఎస్ అకాడ మీ కి చెందిన మంజునాథ్, క్రిష్ణ సాయికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న పరిశ్రమ యాజమాన్యాలు సిఎస్ఆర్ ఫండ్ ద్వారా గ్రంథాలయాలను దత్తత తీసుకొని గ్రంథాలయ అభివృద్ధికి దోహదపడవలసిన కోరారు.విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయాల్లో విలువైన పాఠ్యపుస్తకాలను చదివి భవిష్యత్తులో మంచి మంచి ఉద్యోగాలు సంపాదించి బంగారు భవిష్యత్తును చేసుకోవాల్సిందిగా కోరారు. గ్రంథాలయంలో పాటకులను పెంచవలసిందిగా గ్రంథాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలలో

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్



**రామకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 18:**
రాజుపేట గ్రామంలోని గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో భారీగా విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన కంచర్ల శ్రీకాంత్, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య ఎంత అవసరమో ఆయన పేర్కొన్నారు. గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ అందిస్తున్న విద్యా ప్రమాణాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ రెడ్డి ఫౌండర్, జ్యోతిషర్ గాంధీ ప్రిన్సిపల్,డా. కృష్ణ, ప్రైవేట్ పాఠశాలల కొంత మంది ప్రతినిధులు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, ఎంపీపీ, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.ఐ

## ఈదులగుంట ఈద్గా మార్గం ఆక్రమణ పై స్థానికుల ఆందోళన



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఏప్రిల్ 18:**
శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ ఎదురుగా ఉన్న ఈదులగుంట ఈద్గాకు వెళ్లే మార్గం ఆక్రమణకు గురవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మార్గం మధ్యలో రాళ్లు వేస్తూ క్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారు వాపోతున్నారు. తొట్టంబేడు మండలం ఈదులగుంట కాలనీ పరిధిలోని రోడ్డు పక్కనున్న ఈ స్థలం ప్రజల వినియోగానికి సంబంధించినదని ముఖ్యంగా ప్రార్థనలకు వెళ్లే భక్తులకు ఈ మార్గం కీలకమని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఇటీవలి కాలంలో కాసురాళ్లతో మార్గాన్ని అడ్డగించి ఆక్రమణలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను వెంటనే తొలగించి. మార్గాన్ని స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జనగణన నిర్వహణపై ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 18:**
శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలో జనగణనపై ఏమ్యునరేటర్లకు శిక్షణ తరగతులను శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో నేడు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో ని ఏమ్యున రేటర్లకు మూడు విభాగాలుగా విభజించి శిక్షణ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సుమారు 50మంది ఈ శిక్షణకు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా జనగణన కు సంబంధించి అన్ని విషయాలను శిక్షకులకు పూర్తిస్థాయిలో వారు వివరిం చమని,ఇక్కడ శిక్షణ పొందిన ఏమ్యునరేటర్లకు, ప్రజల వద్దకు వెళ్లి జన గణనకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని, ప్రజలు తమ వద్దకు వచ్చే ఉద్యోగులకు వారు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పి ఉద్యోగులకు సహకరించవల సిందిగా కోరారు.

# వాకాడులో 'వాటర్ పాజిటివ్ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణ



**చిత్తూరు ఎక్స్ ప్రెస్, వాకాడు (ఏప్రిల్ 18) :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఏప్రిల్ 18న వాకాడు మండలంలోని గురుకుల పాఠశాలలో విజయవంతంగా నిర్వహించబడింది. ప్రతి నెల మూడవ శనివారం జరిగే ఈ కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సమక్షంలో జరిగింది.ఈ నెల అంశం 'వాటర్ పాజిటివ్ ఆంధ్ర'.నీటి సంరక్షణ మరియు స్థిరమైన వినియోగం ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరూ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ స్వీకరించి, పరిశుభ్రత మరియు పర్యావరణ రక్షణ పట్ల తమ నిబద్ధతను తెలిపారు.ఎంపీడీఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి సంరక్షణ అత్యవసరమని, దైనందిన జీవితంలో బాధ్యతాయుత అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఎంఈఓ-2), డిప్యూటీ ఎంపీడీఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మహిళా రిజర్వేషన్లు..

## చరిత్రలో మరో కీలక మలుపు

లోకసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం దేశ రాజకీయాలలో మరో కీలక మలుపుగా నిలిచింది. రాజ్యాంగ సవరణ స్థాయి బిల్లులు సాధారణ చట్టాల కంటే విభిన్నమైన ప్రామాణికతను, విస్తృత రాజకీయ సమ్మతిని కోరుకుంటాయి. 131వ రాజ్యాంగ సవరణగా ప్రతిపాదించ బడిన ఈ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన, కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు వంటి కీలక ప్రతిపాదనలు ఒకేసారి లోకసభ ముందుకు రావడం రాజకీయంగా ఆసక్తికరమైనా, వ్యూహాత్మకంగా ప్రమాదకర నిర్ణయంగా మారింది. 528 మంది సభ్యులు పాల్గొన్న ఓటింగ్‌లో 298 అనుకూల ఓట్లు, 230 వ్యతిరేక ఓట్లు రావడం గణాంక పరంగా మెజార్టీలా కనిపించినా, రాజ్యాంగ సవరణకు అవసరమైన రెండు-మూడవ వంతు మెజార్టీ సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇదే ఈ పరిణామానికి మూల కారణం. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా మహిళా రిజర్వేషన్ల చరిత్రను పరిశీలించాల్సి ఉంటుంది. 1990ల నుంచే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచన రాజకీయ చర్చల్లో నిలిచింది. 1996లో మొదటిసారి ఈ బిల్లు ప్రవేశపెట్ట బడినా, అప్పటి నుండి అనేకసార్లు అది పార్లమెంట్‌లో ప్రవేశించి నిలిచి పోయింది. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందినా, లోకసభలో ఆమోదం పొందకపోవడం వల్ల చట్టరూపం దాల్చలేదు. అంటే, మహిళా రిజర్వేషన్లు భారత రాజకీయాల్లో ఒక 'అసంపూర్తి వాగ్దానం'గా మిగిలి పోయాయి. ప్రస్తుత సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును మళ్లీ తీసుకురావడం వెనుక రాజకీయ, సామాజిక రెండు కోణాలు ఉన్నాయి. ఒకవైపు మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పుకోవడం, మరోవైపు ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కనిపించింది. అయితే, ఈ బిల్లును ఇతర రెండు కీలక బిల్లులతో కలిపి ఒకేసారి ప్రవేశ పెట్టడం ప్రభుత్వ వ్యూహంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది అత్యంత సున్నితమైన అంశం. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే భయం చాలా కాలంగా ఉంది. ఇదే సమయంలో కేంద్ర పాలిత ప్రాంతాల సీట్ల పెంపు ప్రతిపాదన కూడా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా నిలిచింది. ఈ రెండు అంశాలు ప్రాంతీయ అసమానతలు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ తిరుగుతుండగా, మహిళా రిజర్వేషన్ అనే సర్వసాధారణంగా అంగీకరించ దగిన అంశాన్ని కూడా వివాదంలోకి లాగినట్లైంది. లోకసభలో జరిగిన ఓటింగ్ గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం సాధారణ మెజార్టీని సాధించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన ప్రత్యేక మెజార్టీ దూరంగా ఉంది. మొత్తం హాజరైన సభ్యులలో కనీసం రెండు మూడవ వంతు అనుకూల ఓట్లు అవసరం. 528 మంది సభ్యులు ఉన్న సందర్భంలో కనీసం 352 ఓట్లు అవసరం కాగా, ప్రభుత్వం 298 ఓట్లకే పరిమితమైంది. అంటే సుమారు 54 ఓట్ల లోటుతో బిల్లు వీగిపోయింది.ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే?ఇది ప్రభుత్వ వ్యూహపరమైన పొరపాటా? లేక ఉద్దేశపూర్వక రాజకీయ ప్రణాళికా? విశ్లేషకుల అభిప్రాయాలు ఈ విషయంలో విభిన్నంగా ఉన్నాయి. ఒక వర్గం అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం మూడు బిల్లులను కలిపి ప్రవేశపెట్టడం ద్వారా ప్రతిపక్షాలను చిక్కులో పెట్టాలని భావించింది. మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే మహిళా వ్యతిరేకులుగా ముద్ర పడుతుంది; మిగతా బిల్లులకు అనుకూలంగా ఓటు వేస్తే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఈ పరిస్థితిలో ప్రతిపక్షాలు విభజిత మవుతాయని ప్రభుత్వం అంచనా వేసి ఉండవచ్చు. అయితే వాస్తవ ఫలితం వ్యతిరేకంగా వచ్చింది. ప్రతిపక్షాలు ఈ మూడు బిల్లులను వేర్వేరుగా పరిశీలించాలని డిమాండ్ చేశాయి. ముఖ్యంగా పునర్విభజన అంశంపై స్పష్టత లేకపోవడం, మహిళా రిజర్వేషన్ అమలు ఎప్పటి నుంచి అనేది తెలియక పోవడం, కొన్ని వర్గాలకు ఉప-రిజర్వేషన్ల అంశం స్పష్టంగా లేకపోవడం వంటి కారణాలు ప్రతిపక్షాలను ఒక్కటిగా నిలబెట్టాయి. ఫలితంగా వారు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసే నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ మరో కీలక అంశం ప్రాంతీయ పార్టీల వైఖరి. కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్‌కు మౌలికంగా అనుకూలంగానే ఉన్నప్పటికీ, పునర్విభజనతో తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయంతో బిల్లును వ్యతిరేకించాయి. అంటే, మహిళా సాధికారత అనే అంశం ప్రాంతీయ రాజకీయాల కంటే తక్కువ ప్రాధాన్యత పొందినట్లు కనిపించింది.కేంద్ర ప్రభుత్వానికి ఇది రాజకీయంగా కూడా ఒక హెచ్చరికగా భావించవచ్చు. రాజ్యాంగ సవరణలు కేవలం సంఖ్యలతో కాదు, విశ్వాసంతో ఆమోదం పొందాలి. ప్రతిపక్షాలను సంప్రదించకుండా, విస్తృత చర్చలు లేకుండా, కీలక బిల్లులను ఒకేసారి ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిని వ్యూహాత్మక పొరపాటు అని చెప్పడం అతిశయోక్తి కాదు.అయితే మరో కోణంలో చూస్తే, ఇది ఒక రాజకీయ ప్రయోగంగా కూడా భావించవచ్చు. ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశపెట్టి, ప్రతిపక్షాల అసలు వైఖరిని ప్రజల ముందు ఉంచాలని భావించి ఉండవచ్చు. మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తున్నామని చెప్పుకునే పార్టీలే చివరకు వ్యతిరేకంగా ఓటు వేసిన పరిస్థితి ప్రజల్లో చర్చకు దారి తీస్తుంది. ఎన్నికల సమయంలో ఇది ఒక ప్రధాన ప్రచార అంశంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి, లోకసభలో ఈ మూడు బిల్లులు వీగిపోవడం ఒకే సమయంలో రాజకీయ వ్యూహం, లెక్కచేసిన రిస్క్, అలాగే అమలు లోపం? కలయికగా కనిపిస్తుంది. మహిళా రిజర్వేషన్ వంటి కీలక సామాజిక సంస్కరణ మరోసారి ఆలస్యమవడం బాధాకరం. అయితే ఈ సంఘటన భవిష్యత్తులో ఇలాంటి బిల్లులను ఎలా ప్రవేశపెట్టాలి, ఎలా సమ్మతి సాధించాలి అనే విషయంలో ఒక పాఠంగా నిలుస్తుంది. దేశ రాజకీయాలలో సంఖ్యల గణితం మాత్రమే కాదు, సమన్వయం, సమ్మతి, సమగ్ర దృక్పథం కూడా అంతే ముఖ్యమని ఈ పరిణామం స్పష్టంగా తెలియ జేస్తోంది. మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే, అది కేవలం బిల్లుగా కాకుండా, రాజకీయ సంకల్పంగా మారాలి. లేదంటే, అది ప్రతి సారి పార్లమెంట్ గడప దాటక ముందే నిలిచిపోతూనే ఉంటుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143